# ఏఎంసీపై కార్పొరేటర్ వీరంగం

- కార్యాలయానికి వెళ్లి దాడికి యత్నం, బెదిరింపులు
- ఉన్నతాధికారుల ఎదుటే తిట్ల పురాణం
- పెన్‌డౌన్ చేసి విధులు బహిష్కరించిన జీహెచ్‌ఎంసీ సిబ్బంది
- జోనల్ కమిషనర్, పోలీసులకు ఫిర్యాదు


విధులను బహిష్కరించి ఆందోళన చేస్తున్న అధికారులు, సిబ్బంది

**యూసుఫ్‌గూడ, జూన్ 19 (ఆంధ్రజ్యోతి):** జీహెచ్‌ఎంసీ అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్‌పై కార్పొరేటర్ గురువారం వీరంగం సృష్టించారు. తాను పిలిస్తే రానందుకు తన మనుషులతో సర్కిల్ కార్యాలయానికి వచ్చి ఉన్నతాధికారులు, సిబ్బంది ఎదుటే వాదనకు దిగాడు. దుర్భాషలాడడంతో పాటు దాడికి యత్నించి బెదిరింపులకు పాల్పడ్డాడు. కార్పొరేటర్ చర్యను నిరసిస్తూ జీహెచ్‌ఎంసీ సర్కిల్ సిబ్బంది పెన్‌డౌన్ ప్రకటించారు. విధులను బహిష్కరించి ఆందోళనకు దిగారు. నగరానికి చెందిన బాలరాజు యూసుఫ్‌గూడ సర్కిల్ కార్యాలయంలో జీహెచ్‌ఎంసీ అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్‌గా పనిచేస్తున్నారు. ఈనెల 18న రహ్మత్‌నగర్ కార్పొరేటర్ సీఎన్‌రెడ్డి ఫోన్ చేసి తాను బస్తీల్లో పర్యటిస్తున్నానని రావాల్సిందిగా సూచించాడు. బాలరాజు అప్పటికే ఉన్నతాధికారుల సమావేశంలో ఉండడంతో తనకు కుదరదని చెప్పాడు. మరో రోజు పర్యటన పెట్టుకోవాలని బాలరాజు సూచించారు. ఈ విషయమై ఇద్దరి మధ్య చిన్నపాటి వాగ్వాదం జరిగింది. కొద్దిసేపటికి కార్పొరేటర్ సీఎన్‌రెడ్డి మరికొంతమందితో కలిసి సర్కిల్ కార్యాలయానికి వచ్చారు. ఉన్నతాధికారుల ఎదుటే తనను దుర్భాషలాడడమే కాకుండా దాడికి యత్నించడంతో పాటు చంపేస్తానని బెదిరించాడని బాలరాజు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. కార్పొరేటర్ నుంచి తనకు ప్రాణహానీ ఉందని తగిన రక్షణ కల్పించడంతో పాటు చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. డీఎంసీ అక్కడే ఉన్నారు కాబట్టి తాను బతికి బయటపడ్డానని లేదంటే హత్యాయత్నం జరిగేదని పేర్కొన్నారు.

## విధుల బహిష్కరణ

బాలరాజుపై కార్పొరేటర్ వీరంగాన్ని నిరసిస్తూ సర్కిల్ సిబ్బంది పెన్ డౌన్ ప్రకటించారు. విధులు బహిష్కరించడంతోపాటు ఆందోళనకు దిగారు. సిబ్బందికి ఐఎన్‌టీయూసీ మద్దతు ప్రకటించింది. ఈ సందర్భంగా నగర అధ్యక్షుడు ఆదిల్ షరీఫ్ మాట్లాడుతూ ఉన్నతాధికారి సమక్షంలో బాలరాజుపై దాడికి యత్నించిన కార్పొరేటర్ సీఎన్‌రెడ్డితో పాటు అతడి అనుచరులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆందోళన అనంతరం సిబ్బంది ర్యాలీగా శేరిలింగంపల్లిలోని జోనల్ కమిషనర్‌ను కలిసేందుకు వెళ్లారు.

## ఫిరాయింపుదారులతో కాంగ్రెస్‌కు నష్టం

పార్టీ ఫిరాయింపుదారులు చేసే వ్యక్తిగత పనులు, దాడులతో కాంగ్రెస్ పార్టీకి నష్టం జరుగుతుందని నగర కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి బండపల్లి భవానీశంకర్ అన్నారు. బాలరాజుపై కార్పొరేటర్ దాడిని ఖండించారు. జీహెచ్‌ఎంసీ కార్యాలయంలో బాలరాజును కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలతో కలిసి సంఘీభావం తెలిపారు. కార్పొరేటర్ తీరుపై పార్టీ అధిష్టానానికి ఫిర్యాదు చేస్తామన్నారు. కార్యక్రమంలో డివిజన్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి గ్యార నాగరాజు, యాదయ్య, అరుణ్‌గౌడ్, సుందర్ రాజు, బెన్హర్, శివ పాల్గొన్నారు.


బాలరాజుకు సంఘీభావం తెలుపుతున్న నగర కాంగ్రెస్ నాయకులు

# అభివృద్ధి పనులపై ప్రశ్నిస్తే అభాండాలు

● కార్పొరేటర్ సీఎన్‌రెడ్డి

**బోరబండ, జూన్ 19 (ఆంధ్రజ్యోతి):** రహ్మత్‌నగర్ డివిజన్ అభివృద్ధే తన ప్రధాన లక్ష్యమని, ప్రజల ప్రతినిధిగా వారి సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లడం తన బాధ్యత అని కార్పొరేటర్ సీఎన్‌రెడ్డి పేర్కొన్నారు. జీహెచ్‌ఎంసీ సర్కిల్-19 ఏఎంసీ బాలరాజుతో ఎలాంటి వ్యక్తిగత విరోధాలు లేవని ఒక ప్రకటనలో ఆయన తెలిపారు. రహ్మత్‌నగర్ చౌరస్తా నుంచి శ్రీరామనగర్ వరకు ఏర్పాటు చేసిన ఫుట్‌పాత్‌లపైన నూతన ఆక్రమణలు, కార్మికనగర్, ముబారక్ కేఫ్ వద్ద చెత్త పేరుకుపోవడం, స్థానిక వైన్స్‌షాప్ పక్కన ఉన్న లైబ్రరీ తొలగింపు విషయంలో అలసత్వం, బూత్ స్థాయిలో ఒకే కుటుంబానికి చెందిన ఓటర్లు వేర్వేరు బూత్‌లలో నమోదు కావడం వంటి సమస్యల పరిష్కారం కోసం అధికారులను అనేకసార్లు కోరినప్పటికీ, స్పందన లేదని ఆయన తెలిపారు. గత నెల రోజులుగా వార్డు స్థాయిలో అధికారుల పర్యటనలు ఎక్కడా జరగలేదని, ప్రజల సమస్యలపై స్పందన ఉండాలన్నదే తమ కోరిక అని పేర్కొన్నారు.

బుధవారం ఉదయం 11:30 గంటలకు వార్డు కార్యాలయానికి వెళ్లి అధికారిని కలవడానికి వేచి ఉన్నామని, ఫోన్‌లో సంప్రదించగా 'షేక్‌పేటలో ఉన్నా' అని ఏఎంసీ చెప్పారని తెలిపారు. ఆఫీస్‌కు వచ్చిన అధికారులు, 'మీరు ఎవరు నన్ను ప్రశ్నించడానికి? మీ లీడర్లు ఏం చేస్తున్నారు?' అంటూ దురుసుగా స్పందించారని, 'ఒక జీతానికి అనేక పనులు చేస్తున్నాను' అనే వ్యాఖ్యలు బాధాకరమని ఆయన పేర్కొన్నారు. తనకు ఎవరిపై కోపం ఉండదని ఆయన పేర్కొన్నారు.


ఎస్సీ, ఎస్టీ మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌కు శుభాకాంక్షలు చెబుతున్న ఎంబీఎం పార్టీ నాయకుడు ఎర్ర నాగేష్, ఎంఆర్‌పీస్ నాయకుడు బి.సాయికుమార్ తదితరులు
● ఎర్రగడ్డ, ఆంధ్రజ్యోతి


హైదరాబాద్ కలెక్టర్‌గా నియమితులైన హరిచందనను మర్యాద పూర్వకంగా కలిసిన మాల వెలుగు సంఘం ప్రధాన కార్యదర్శి దండు లక్ష్మణ్, రాజలింగం తదితరులు
● బంజారాహిల్స్, ఆంధ్రజ్యోతి

## ఒకే రోజు.. గంట వ్యవధిలో రెండు బైక్‌లు చోరీ

**బేగంపేట, జూన్ 19 (ఆంధ్రజ్యోతి):** బేగంపేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని శ్యామ్‌లాల్ బిల్డింగ్, ప్రకాశ్‌నగర్‌లో ఒకే రోజు గంట వ్యవధిలో రెండు బైక్‌లు చోరీకి గురయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జగద్గిరిగుట్టకు చెందిన రవిచందర్ అమెజాన్ డెలివరీ బాయ్. ఈనెల 16వ తేదీన బేగంపేట గురుమూర్తిలైన్‌లోని ఆల్‌రిచ్ అపార్ట్‌మెంట్‌లో డెలివరీ ఇచ్చేందుకు మధ్యాహ్నం 12 గంటలకు వచ్చాడు. బైక్ బయట పార్క్ చేసి ఫ్లాట్‌లోకి వెళ్లి డెలివరీ ఇచ్చి వచ్చేసరికి బైక్ కనబడలేదు. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అలాగే, వెంకటనర్సదాస్ ప్రకాశ్‌నగర్‌లోని ఓ ప్రైవేట్ కంపెనీలో పనిచేస్తున్నాడు. ఈనెల 16వ తేదీన విధులకు హాజరైన ఆయన ప్యాషన్ పల్సర్(బ్లూ)ను కార్యాలయం బయట పార్క్ చేశారు. లంచ్ సమయానికి బయటకు వచ్చి చూడగా బైక్ కనబడలేదు. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసులు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. రెండు బైక్‌లు కేవలం గంట వ్యవధిలో చోరీకి గురైనట్లు పోలీసుల దర్యాప్తులో తేలిందని తెలిసింది. నిందితుల గుర్తింపు కోసం సీసీ కెమెరాలను పోలీసులు జల్లెడ పడుతున్నట్లు తెలిసింది.

## ముగ్గురు యువకులపై దాడి

**యూసుఫ్‌గూడ, జూన్ 19 (ఆంధ్రజ్యోతి):** ముగ్గురు యువకులపై గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేసి ఫోన్‌లు తస్కరించి పారిపోయారు. ఈ సంఘటన మధురానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. యూసుఫ్‌గూడలో నివాసం ఉంటున్న దిలీప్, నవీన్, షరీఫ్ స్నేహితులు. మాదాపూర్‌లోని ఓ రెస్టారెంట్‌కు వెళ్లి వస్తున్నారు. బుధవారం రాత్రి వెంకటగిరి మార్గం మధ్యలోకి రాగానే గుర్తు తెలియని వ్యక్తులు అడ్డుకొని దాడి చేశారు. దాడి నుంచి తప్పించుకొని దిలీప్ అనే యువకుడు మధురానగర్ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి పోలీసులను సంఘటన స్థలానికి తీసుకెళ్లారు. అప్పటికే ఆ యువకులు దాడి చేసి మూడు ఫోన్‌లను తీసుకొని పారిపోయారు. బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

## ఆన్‌లైన్ మోసం

**యూసుఫ్‌గూడ, జూన్ 19 (ఆంధ్రజ్యోతి):** మాయమాటలు చెప్పి ఓ యువకుడు ఆన్‌లైన్‌లో డబ్బులు దోచుకున్నాడు. మధురానగర్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. యూసుఫ్‌గూడకు చెందిన ఉమాదేవి సెల్‌ఫోన్‌కు గుర్తు తెలియని వ్యక్తి ఫోన్ చేశాడు. 'మీకు నా నంబర్‌తో రూ.20 వేలు వచ్చాయి. తిరిగి పంపించండి' అని కోరాడు. ఆమె పంపించింది. నగదు రాలేదని చెప్పడంతో మళ్లీ మెసేజ్ పంపిస్తూ సుమారు రూ.లక్షకు పైగా పంపించింది. ఈ విషయాన్ని ఉమాదేవి కుమారుడు క్రాంతికుమార్‌కు బుధవారం చెప్పింది. మోసం జరిగిందని గ్రహించిన క్రాంతికుమార్ పోలీసులకు గురువారం ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేశారు.

## వేర్వేరు ప్రాంతాలకు చెందిన ముగ్గురు అదృశ్యం

**యూసుఫ్‌గూడ/బోరబండ, జూన్ 19 (ఆంధ్రజ్యోతి):** వేర్వేరు ప్రాంతాలకు చెందిన ముగ్గురు వేర్వేరు కారణాలతో అదృశ్యమయ్యారు. పోలీసులు కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మధురానగర్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కళ్యాణ్‌నగర్ కాలనీకి చెందిన ఎం.సాయిచరణ్ కారు డ్రైవర్. తల్లి లత కుమారుడిని డ్రైవింగ్ చేయవద్దని చెప్పడంతో ఈనెల 7న ఇంటి నుంచి వెళ్లిపోయాడు. తల్లి ఫోన్ చేస్తుంటే ఎత్తడం లేదు. ఈనెల 10న తల్లికి ఫోన్ చేశాడు. ఇంటికి రమ్మని చెప్పడంతో సరే అంటూనే ఫోన్ స్విచ్ఛాఫ్ చేశాడు. దీంతో తల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది.

**కటింగ్ షాపులో పనిచేసే యువకుడు..**


నవాజీష్

బోరబండ పోలీస్‌స్టేషన్ పరిధి శ్రీరామ్‌నగర్‌లోని కటింగ్ షాపులో పనిచేసేందుకు వచ్చిన యువకుడు అదృశ్యమయ్యాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పంజాబ్ లూధియానాకు చెందిన ఇమ్రాన్ తనయుడు నవాజీష్ (20) శ్రీరామ్‌నగర్‌లోని ఎల్విక్స్ కటింగ్ సెలూన్‌లో పనిచేసేందుకు పది రోజుల క్రితం వచ్చాడు. శ్రీరామ్‌నగర్‌లో నివసిస్తున్న అతడి మేనత్త వద్ద ఉండేవాడు. కాగా, ఈనెల 17న ఇంట్లోనూ, షాపులోనూ ఎవరికీ చెప్పకుండా నవాజీష్ వెళ్లిపోయాడు. యువకుడి బంధువు ముఖ్తియార్ అహ్మద్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

**ఇంటి నుంచి యువతి..**

బోరబండ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఇంటి నుంచి బయటకు వెళ్లిన యువతి అదృశ్యమైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎస్పీఆర్ హిల్స్ రాజీవ్ గాంధీనగర్‌కు చెందిన కిరాణా దుకాణం నిర్వాహకుడు బిరాదర్ మాధవరావు కూతురు అంబిక(25) 19వ తేదీ తెల్లవారుజామున 5.30 గంటల సమయంలో ఇంటి నుంచి బయటకు వెళ్లింది. తిరిగి రాకపోవడంతో ఆమె తండ్రి బోరబండ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.


పంజాగుట్టలోని పీవీఆర్ మాల్‌లో ప్రదర్శించిన జ్యోతి బాఫూలే చిత్రాన్ని గురువారం సీనియర్ కాంగ్రెస్ నేతలు, మాజీ ఎంపీలు వి.హనుమంతరావు, మధుయాష్కీగౌడ్ తదితరులు వీక్షించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సామాజిక అసమానతలు, వివక్ష, మహిళలపై అణిచివేతలు తదితర సామాజిక దురాఘాతాలకు వ్యతిరేకంగా జ్యోతిబాఫూలే, సావిత్రిబాయిఫూలేలు చేసిన పోరాటం మరువలేనిదని, ప్రతీ ఒక్కరూ ఈ సినిమా చూడాలని సూచించారు.
● పంజాగుట్ట, ఆంధ్రజ్యోతి


క్రీడా సామగ్రి అందజేస్తున్న విజయారెడ్డి

## విద్యార్థులకు క్రీడా సామగ్రి పంపిణీ

**ఖైరతాబాద్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి):** ఖైరతాబాద్ డివిజన్ ఏసీ గార్డ్స్‌లోని మైనారిటీ గురుకుల బాలికల హాస్టల్ విద్యార్థులకు కార్పొరేటర్ విజయారెడ్డి గురువారం క్రీడా సామగ్రిని పంపిణీ చేశారు. విద్యార్థులతో కార్పొరేటర్ కొంతసేపు సరదాగా గడిపారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ వాజీద, కో-ఆర్డినేటర్ శాంభవి, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## బనకచర్ల-గోదావరి ప్రాజెక్ట్ పునాది వేసిందే కేసీఆర్

**బేగంపేట, జూన్ 19 (ఆంధ్రజ్యోతి):** ఏపీ ప్రభుత్వం తలపెట్టిన బనకచర్ల-గోదావరి ప్రాజెక్ట్‌కు పునాది వేసిన పాపం అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్‌దే అని టీపీసీసీ ఉపాధ్యక్షురాలు డా. కోట నీలిమ ఆరోపించారు. ఈ మేరకు ఆమె గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. కేసీఆర్ అప్పటి ఏపీ ముఖ్యమంత్రి జగన్‌తో చేతులు కలిపి తెలంగాణకు తీవ్ర అన్యాయం చేశారని ఆమె ఆరోపించారు. కేసీఆర్ ఆంధ్రప్రదేశ్‌కు వెళ్లి రాయలసీమను రతనాల సీమగా మారుస్తానని మీడియా సమావేశంలో చెప్పారని గుర్తు చేశారు. ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో కేంద్రంపై ఒత్తిడి తెచ్చి బనకచర్లను అడ్డుకుంటామని ఆమె తెలిపారు. ఇప్పటికే కాళేశ్వరం ప్రాజెక్ట్‌తో తెలంగాణకు కేసీఆర్ తీవ్ర అన్యాయం చేశారని మండిపడ్డారు.

## బెస్ట్ అవైలబుల్ పాఠశాలలకు దరఖాస్తు గడువు పెంచాలి

**బంజారాహిల్స్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి):** బెస్ట్ అవైలబుల్ పాఠశాలలకు దరఖాస్తు గడువు పెంచాలని ఎంబీఎం నాయకులు నగేష్ కోరారు. గురువారం ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ శాఖ మంత్రి లక్ష్మణ్‌కు వినతిపత్రం ఇచారు. దరఖాస్తుకు ఈనెల 2న చివరి తేదీ అని ప్రకటించారని, వరుస ప్రభుత్వ సెలవుల కారణంగా అనేక మంది విద్యార్థుల తల్లిదండ్రులు కుల ధ్రువీకరణపత్రం పొందలేకపోయారని పేర్కొన్నారు.

## నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

**పంజాగుట్ట, జూన్ 19 (ఆంధ్రజ్యోతి):** బంజారాహిల్స్ ఏడీఈ పరిధిలోని పలు ప్రాంతాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏడీఈ జి.గోపీ తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు 11కేవీ ఊడ్స్ అపార్ట్‌మెంట్, ఎమ్మెల్యే కాలనీ ఫీడర్ల పరిధిలోని పలు ప్రాంతాల్లోనూ, మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు 11 కేవీ ఆరోగ్యశ్రీ, లోటస్ పాండ్ ఫీడర్ల పరిధిలోని ప్రాంతాల్లోనూ విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏడీఈ పేర్కొన్నారు.

## బీదర్ నుంచి నగరానికి గంజాయి నలుగురు యువకుల అరెస్ట్

**రాజేంద్రనగర్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి):** బీదర్ నుంచి ఎండు గంజాయిని నగరానికి తీసుకొస్తున్న నలుగురు యువకులను రాజేంద్రనగర్ పోలీసులు గురువారం పట్టుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... బుద్వేల్‌కు చెందిన డి.జగదీశ్(22), చింతల్‌మెట్‌కు చెందిన ఎం.రాంకుమార్(23), బుద్వేల్‌కు చెందిన బి.మనోజ్(19), బి.నాగేందర్(21) కలిసి కారులో బీదర్ వెళ్లారు. బీదర్‌కు చెందిన మహేశ్ అనే వ్యక్తి వద్ద ఐదు కిలోల ఎండు గంజాయిని తీసుకొస్తున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు రాజేంద్రనగర్ పోలీసులు గురువారం వాహనాలను తనిఖీ చేస్తుండగా, గంజాయి కలిగి ఉన్న కారును ఆపి తనిఖీ చేసి ఐదు కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. కారును సీజ్ చేశారు. నలుగురు యువకులను రిమాండ్‌కు తరలించిన రాజేంద్రనగర్ పోలీసులు గంజాయి సరఫరా చేసిన బీదర్‌కు చెందిన మహేశ్ కోసం గాలిస్తున్నారు.

# ఎస్సీ వర్గీకరణలో సీఎం కృషి అభినందనీయం

**బోరబండ, జూన్ 19 (ఆంధ్రజ్యోతి):** ఎస్సీ వర్గీకరణలో సీఎం రేవంత్‌రెడ్డి కృషి అభినందనీయమని ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పిడమర్తి రవి అన్నారు. రహ్మత్‌నగర్ డివిజన్ ఎస్పీఆర్ హిల్స్ రెండుబొమ్మల కూడలిలో అంబేడ్కర్, బాబూజగ్జీవన్‌రామ్ విగ్రహాలకు కార్పొరేటర్ సీఎన్.రెడ్డితో కలిసి గురువారం ఆయన పూలమాలలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొన్ని దశాబ్దాలుగా విద్య, ఉద్యోగం, ఉపాధికి దూరంగా ఉన్న మాదిగల అభివృద్ధి కేవలం రిజర్వేషన్లతోనే సాధ్యమని తెలిపారు. 30 సంవత్సరాలుగా చేసిన న్యాయ పోరాటానికి కోర్టులు తుదితీర్పు ఇవ్వడంతో మాదిగ జాతిలో నూతన ఉత్తేజం నెలకొందని పేర్కొన్నారు. కార్పొరేటర్ సీఎన్‌రెడ్డి మాట్లాడుతూ దళితుల అభ్యున్నతి కోసం డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ ఎంతో కృషి చేశారన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, స్థానికులు పాల్గొన్నారు.


పిడమర్తి రవిని సన్మానించిన సీఎన్‌రెడ్డి

# చిత్రపురి కాలనీలో అవినీతికి పాల్పడిన వారిపై పీడీయాక్ట్ పెట్టాలి

**బంజారాహిల్స్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి):** చిత్రపురి కాలనీలో అవినీతికి పాల్పడ్డ వారిపై పీడీ యాక్ట్ నమోదు చేయాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. చిత్రపురికాలనీలో జరిగిన అక్రమాలను నిరసిస్తూ గురువారం ఫిలించాంబర్ వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 64 ఎకరాల స్థలంలో 24 క్రాఫ్ట్‌కు సంబంధించిన వారికి కాకుండా బయటి వారికి కేటాయించి కోట్ల రూపాయలను కాలనీ కమిటీ కార్యవర్గ సభ్యులు వెనకేసుకున్నారని ఆరోపించారు. డివిజనల్ కో-ఆపరేటివ్ సొసైటీ నిబంధనల ప్రకారం 2016 తర్వాత సభ్యులను చేర్చుకోవద్దని స్పష్టంగా ఉండగా, కార్యవర్గం మాత్రం సుమారు ఐదువేల మందికి అక్రమంగా సభ్యత్వం ఇచ్చిందని ఆరోపించారు. గవర్నింగ్ బాడీని రద్దు చేస్తూ గతంలోనే కో-ఆపరేటివ్ సొసైటీ నిర్ణయం తీసుకున్నప్పటికీ ప్రస్తుతం కమిటీ రాజీనామా చేయకపోగా సర్వసభ్య సమావేశాలు నిర్వహిస్తూ తీవ్రస్థాయిలో అవినీతికి పాల్పడుతుందన్నారు. అన్ని అర్హతలు ఉన్నప్పటికీ కావాలని కొంత మందికి ఇళ్ల కేటాయింపు జరగలేదని, ఆయా ఇళ్లను అధిక ధరకు అమ్ముకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం కలగజేసుకొని చిత్రపురి కాలనీ కమిటీని పూర్తిస్థాయిలో ప్రక్షాళన చేసి కొత్త వారికి అనుమతిచ్చి సభ్యులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు ఈశ్వర్‌రావు, సంకూరి రవీందర్, మద్దినేని రమేష్‌బాబు, కస్తూరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.


ఫిలించాంబర్ వద్ద ధర్నా చేస్తున్న సీఐటీయూ నాయకులు

# కళ్యాణ్‌నగర్ కాలనీలో తాగునీటి సమస్యను పరిష్కరించాలి

**ఎర్రగడ్డ, జూన్ 19 (ఆంధ్రజ్యోతి):** ఎర్రగడ్డ డివిజన్‌లోని కళ్యాణ్ నగర్ వెంచర్ త్రీ కాలనీలో తాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరుతూ కాలనీవాసులు గురువారం వాటర్‌వర్క్స్ జనరల్ మేనేజర్ ప్రభాకర్‌కు వినతిపత్రం అందజేశారు. తమ కాలనీలో గత సంవత్సరం వేసవిలో కూడా మంజీరా నీరు రెండు, మూడు గంటలపాటు రోజు విడిచి రోజు వచ్చేవని తెలిపారు. ప్రస్తుతం కాలనీలో నీటి సమస్య తీవ్రంగా ఉందన్నారు. తాగునీరు సరఫరా అయ్యే కొన్నిచోట్ల కూడా ప్రెషర్ తక్కువ రావడం వల్ల నీళ్లు ఏమాత్రం సరిపోవడం లేదని వారు పేర్కొన్నారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో కాలనీవాసులు వి.శ్రీనివాసులురెడ్డి, బి.నర్సింహారావు, రాజేష్, నారాయణరెడ్డి, బెనోని ఉస్వాల్డ్ తదితరులు ఉన్నారు.


వాటర్ వర్క్స్ జీఎంకు వినతిపత్రం ఇస్తున్న కళ్యాణ్ నగర్ వెంచర్ త్రీ కాలనీవాసులు

## ● యోగా గురువులు.. సాధన


అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా కేంద్ర ఉక్కు, బొగ్గు గనుల శాఖ ఆధ్వర్యంలో నగరంలోని ఎల్బీస్టేడియంలో నేడు యోగా కార్యక్రమం నిర్వహించనున్నారు. దీనికి గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ, మాజీ ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు, కేంద్ర మంత్రి శ్రీనివాసవర్మ, రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె.లక్ష్మణ్, ఎంపీలు ఆర్.కృష్ణయ్య, ఈటల రాజేందర్, డి.కె.అరుణ, రఘునందన్‌రావు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ప్రముఖ సినీనటి కుష్బు, సినీప్రముఖులు మీనాక్షి చౌదరి, సాయిధరమ్‌తేజ్, తేజ తదితరులు పాల్గొననున్నారు. కాగా, గురువారం వివిధ సంస్థల్లో పనిచేసే యోగా గురువులు, ట్రైనీలు సాధన చేశారు
ఫొటో: స్టాఫ్ ఫొటోగ్రాఫర్, ఆంధ్రజ్యోతి

## పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేసిన ఏసీపీ


సమావేశంలో మాట్లాడుతున్న ఏసీపీ జి.రమేష్, ఇన్‌స్పెక్టర్ నాగరాజు

తిరుమలగిరి జూన్ 19 (ఆంధ్రజ్యోతి): తిరుమలగిరి పోలీస్‌స్టేషన్‌ను నార్త్ జోన్ తిరుమలగిరి ఏసీపీ జి.రమేష్ బుధవారం తనిఖీ చేశారు. పోలీస్‌స్టేషన్ రికార్డులను పరిశీలించి అధికారులకు నేర నిర్వహణ, ప్రజా సంబంధాలు, కేసుల సత్వర పరిష్కారం కోసం ఏసీపీ అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా తిరుమలగిరి పోలీస్‌స్టేషన్ నుంచి బదిలీపై వెళుతున్న సబ్ ఇన్‌స్పెక్టర్లు రాజశేఖర్‌రెడ్డి, ప్రశాంత్, సంధ్య, వెంకటకుమార్‌లను సన్మానించి వీడ్కోలు పలికారు. ఈ అనంతరం బదిలీలపై వచ్చిన డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ విజయ్ రాజు, సబ్ ఇన్‌స్పెక్టర్ కెన్నీ ఫోర్డ్‌లను ఏసీపీ జి.రమేష్, సర్కిల్ ఇన్‌స్పెక్టర్ జే.నాగరాజు పోలీస్ సిబ్బంది ఆహ్వానించారు.


శాస్త్రినగర్ బస్తీలో గస్తీ తిరుగుతున్న తుకారాంగేట్ సీఐ శ్రీకాంత్ రెడ్డి, ఎస్సై రవికుమార్‌తోపాటు పోలీసులు

## అడ్డగుట్టలో పోలీసుల గస్తీ

అడ్డగుట్ట, జూన్ 19 (ఆంధ్రజ్యోతి) : నేరాలను అదుపు చేసేందుకు రాత్రి సమయంలో అడ్డగుట్టలోని పలు కూడళ్ల వద్ద, బస్తీలో గస్తీ తిరుగుతున్నామని తుకారాంగేట్ సీఐ శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. తుకారాంగేట్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని అడ్డగుట్ట తుకారాంగేట్ పరిసర ప్రాంతాల్లో ఎస్సై రవి కుమార్‌తో పాటు క్రైమ్ కానిస్టేబుళ్లు గస్తీ తిరిగారు. ఈ ప్రాంతాల్లో ఏదైనా అసాంఘిక కార్యకలపాలు జరిగితే తమ దృష్టికి తీసుకరావాలని ప్రజల్ని సీఐ కోరారు. ఇందులో భాగంగా శాస్త్రీనగర్‌లోని రుద్రవీణ మహిళా సంఘం కార్యాలయానికి చేరుకుని సంఘంలో ఉన్న సీసీ కెమెరాలను పరిశీలించారు. ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చేందుకే బస్తీలో గస్తీ తిరుగుతున్నామని తెలిపారు.


సామూహిక అక్షరాభ్యాసంలో చిన్నారులు

## ప్రభుత్వ పాఠశాలలో సామూహిక అక్షరాభ్యాసం

చిలకలగూడ, జూన్ 19(ఆంధ్రజ్యోతి):మెట్టుగూడ డివిజన్, దూద్‌బావి ప్రభుత్వ పాఠశాలలో గురువారం సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమం నిర్వహించారు ముఖ్యఅతిథిగా ప్లానింగ్ కమిషన్ వైస్ ఛైర్మన్, రాష్ట్ర ప్రజావాణి ఇన్‌చార్జి డాక్టర్ జి.చిన్నారెడ్డి విచ్చేసి చిన్నారులతో సామూహిక అక్షరాభ్యాసం గావించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడానికి సీఎం 50వేలమంది ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించినట్లు, 64 రోజుల్లో డీఎస్సీ నిర్వహించి 11వేల మంది టీచర్లను నియమించినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో గౌరవ అతిథిగా మారేడుపల్లి మండల ప్రత్యేకాధికారి సూర్య ప్రకాష్, అతిథిగా సికింద్రాబాద్ జోన్ డిప్యూటీ ఎడ్యుకేషనల్ ఆఫీసర్ శ్రీధర్, మారేడుపల్లి మండల డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ స్కూల్స్ మదన్ మోహన్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మల్లికార్జునరెడ్డి, హిందూ, ముస్లిం, క్రైస్తవ మతపెద్దలు పాల్గొన్నారు.


దోమల నివారణపై అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న అధ్యక్షుడు నందారం సీతారాం, జీహెచ్ఎంసీ ఎంటామాలజీ అధికారులు, ఆశావర్కర్లు

## దోమల నివారణపై అవగాహన కార్యక్రమం

బౌద్ధనగర్, జూన్ 19(ఆంధ్రజ్యోతి): సీతాఫల్‌మండి డివిజన్ బీదలబస్తీలో గురువారం దోమల నివారణపై జీహెచ్ఎంసీ ఎంటామాలజి అధికారులు, ఆశావర్కర్లు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీదలబస్తీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు నందారం సీతారాం, స్థానిక బస్తీ నాయకులు జీఎం మల్లేష్, ఏపీ గోవింద్, శ్రీనివాస్, లక్ష్మణ్, ప్రభాకర్‌లు తదితరులు పాల్గొన్నారు. వర్షాకాలం రానున్న నేపథ్యంలో ఇళ్లలో నీటిని ఎక్కువ రోజులు నిల్వ ఉంచవద్దని, నీటి ట్యాంకులను ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచుకోవాలని, తడి చెత్త నిల్వ ఉంచుకోరాదని, దోమ తెరలు వాడటం మంచిదని ఎంటమాలజీ సిబ్బంది సూచించారు. అనంతరం బస్తీలో దోమల నియంత్రణ- ప్రజల పాత్ర కరపత్రాలను పంపిణీ చేశారు. హెల్త్ సూపర్‌వైజర్ ఆర్.శంకర్, ఆశావర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

## గుర్తుతెలియని మహిళ మృతి


గుర్తుతెలియని మహిళ

సికింద్రాబాద్ రైల్వేస్టేషన్, జూన్ 19(ఆంధ్రజ్యోతి) : రైల్వేస్టేషన్‌లో ఓ గుర్తుతెలియని మహిళ మృతి చెందింది. సికింద్రాబాద్ రైల్వే పోలీస్‌స్టేషన్ సబ్ ఇన్‌స్పెక్టర్ రమేష్ తెలిపిన వివరాల ప్రకారం సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ ప్లాట్‌ఫాం నంబరు 6, 7లో గుర్తుతెలియని 35 ఏళ్ల మహిళ చనిపోయి ఉండగా సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు ఘటన స్థలానికి చేరుకున్నారు. మృతురాలిని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ మార్చురీలో భద్రపరిచారు. మృతురాలి ఆచూకి తెలిస్తే 8712658586 నంబరుకు సమాచారం ఇవ్వాలని ఎస్సై కోరారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## గాంధీ ఆస్పత్రిలో గుర్తుతెలియని మృతదేహం లభ్యం

బౌద్ధనగర్, జూన్ 19(ఆంధ్రజ్యోతి): గాంధీ ఆస్పత్రిలో గుర్తుతెలియని మృతదేహాన్ని చిలకలగూడ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. 15న ఉదయం తొమ్మిది గంటలకు గాంధీ ఆస్పత్రి ఎన్టీపీసీ వెయిటింగ్ హాల్ వద్ద ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం పడి ఉందని సెక్యూరిటీ సూపర్‌వైజర్ ఎ.సుబ్బారావు పోలీసులకు ఫిర్యాదు చేశారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని గాంధీ మార్చురీకి తరలించారు. మృతుడు వయసు 40-45 మధ్య ఉంటుందని, మృతుడి వంటిపై బ్లూ, గ్రీన్ చెక్స్ షర్ట్, బ్లూ కలర్ ప్యాంట్ ధరించి ఉన్నాడని పోలీసులు తెలిపారు. మృతుడికి సంబంధించిన వారు ఉంటే చిలకలగూడ పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని పోలీసులు తెలిపారు.

## ఒకే రోజు.. గంట వ్యవధిలో రెండు బైక్‌లు చోరీ

బేగంపేట, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): బేగంపేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని శ్యామ్‌లాల్ బిల్డింగ్, ప్రకాశ్‌నగర్‌లో ఒకే రోజు గంట వ్యవధిలో రెండు బైక్‌లు చోరీకి గురయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జగద్గిరిగుట్టకు చెందిన రవిచందర్ అమెజాన్ డెలివరీ బాయ్. ఈనెల 16వ తేదీన బేగంపేట గురుమూర్తిలైన్‌లోని ఆల్‌రిచ్ అపార్ట్‌మెంట్‌లో డెలివరీ ఇచ్చేందుకు మధ్యాహ్నం 12 గంటలకు వచ్చాడు. బైక్ బయట పార్క్ చేసి ఫ్లాట్‌లోకి వెళ్లి డెలివరీ ఇచ్చి వచ్చేసరికి బైక్ కనబడలేదు. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అలాగే, వెంకటనర్సదాస్ ప్రకాశ్‌నగర్‌లోని ఓ ప్రైవేట్ కంపెనీలో పనిచేస్తున్నాడు. ఈనెల 16వ తేదీన విధులకు హాజరైన ఆయన ఫ్యాషన్ పల్సర్(బ్లూ)ను కార్యాలయం బయట పార్క్ చేశారు. లంచ్ సమయానికి బయటకు వచ్చి చూడగా బైక్ కనబడలేదు. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసులు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. రెండు బైక్‌లు కేవలం గంట వ్యవధిలో చోరీకి గురైనట్లు పోలీసుల దర్యాప్తులో తేలిందని తెలిసింది. నిందితుల గుర్తింపు కోసం సీసీ కెమెరాలను పోలీసులు జల్లెడ పడుతున్నట్లు తెలిసింది.

# సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డుకు
# ప్రత్యేక గ్రాంటు విడుదల చేయండి




- మౌలిక సదుపాయాల విషయంలో ఆచితూచి వ్యవహరిస్తున్న కంటోన్మెంట్
- కేంద్ర రక్షణశాఖ ప్రత్యేక గ్రాంటు ఇవ్వదు
- ఆర్మీ నుంచి సర్వీసు చార్జీల బకాయిలు రావు

సికింద్రాబాద్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): తాము దివాళా స్థితిలో ఉన్నామని, ప్రత్యేక గ్రాంటు విడుదల చేసి ఆదుకోవాలని సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు మొరపెట్టుకుంలోంది. కేంద్ర రక్షణశాఖ అందుకు సానుకూలంగా స్పందించకపోగా, వెయ్యి కోట్ల రూపాయిలకుపైగా ఉన్న సర్వీసు చార్జీలను కూడా చెల్లించకపోవడంపై సర్వత్రా నిరసన వ్యక్తమవుతోంది. జీతాలు కూడా చెల్లించడం గగనంగా మారిన తమకు రూ.300 కోట్ల రూపాయిలు ప్రత్యేక గ్రాంటు విడుదల చేయాలని ఐదేళ్లుగా కంటోన్మెంట్ బోర్డు విన్నవించుకుంటున్నా రక్షణ శాఖ కనికరించడం లేదు. పోనీ.... తమకు ఆర్మీ నుంచి రావలసిన రూ.1,152 కోట్ల సర్వీసు చార్జీల నుంచి 25 శాతమైనా ఇప్పించాలని చేస్తున్న విన్నపాలు సైతం నిష్ప్రయోజనంగా మారాయి. దాంతో ప్రజల అవసరాలకు అనుగుణంగా మౌలిక సదుపాయాలు కల్పించడంలో, అభివృద్ధి పనులు చేపట్టడంలో సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు ఆచితూచి అడుగులు వేయాల్సివస్తోంది. ప్రధాని మోదీతోపాటు కేంద్రమంత్రులు, జాతీయ నాయకులతో సత్సంబంధాలు కలిగి ఉన్న రాష్ట్ర బీజేపీ నేతలు, ప్రజా ప్రతినిధులు కూడా దీనిని పట్టించుకోకపోవడంపై స్థానికంగా నిరసన వ్యక్తమవుతోంది. సికింద్రాబాద్ కంటోన్మెంట్ ఏరియాలో ఉన్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కార్యాలయాలు, సంస్థలు, నివాస సముదాయాలు కంటోన్మెంట్ బోర్డు సేవలు వినియోగించుకుంటున్నందుకుగాను ప్రతి సంవత్సరం సర్వీసు చార్జీలు చెల్లించాల్సి ఉంటుంది. ఆర్మీ, నేవీ, ఎయిర్‌ఫోర్స్, ఎయిర్‌పోర్టు, డీఎండీఈ, సిటీ సివిల్ కోర్టులు, జ్యుడీషియల్ అకాడమీ, పోస్టల్ డిపార్ట్‌మెంట్, ఆర్‌టీఏ, బీఎస్ఎన్ఎల్. పోలీసు తదితర విభాగాలు ప్రతి ఏడాది కంటోన్మెంట్ బోర్డుకు సర్వీసు చార్జీలు చెల్లించాలి. వీటిలో ఆయా విభాగాల నుంచి సర్వీసు చార్జీలు సక్రమంగా వసూలవుతున్నప్పటికీ, ఆర్మీ నుంచి మాత్రం సరిగ్గా వసూలు కావడం లేదు. కొద్ది సంవత్సరాలపాటు వరుసగా ఆర్మీ నుంచి సర్వీసు చార్జీలు వసూలు కాకపోగా, మరి కొన్ని సంవత్సరాలు సర్వీసు చార్జీల్లో చాలా వరకు కోత విధిస్తూ, అతి తక్కువ చెల్లిస్తుండడంతో.... బకాయిలు ఇంతింతై వటుడింతయి.... అన్నట్టు ప్రస్తుతం 1,152 కోట్లకు చేరుకోవడం గమనార్హం. 1984వ సంవత్సరం నుంచి సర్వీసు చార్జీల చెల్లింపు విషయంలో కోత విధిస్తూ వస్తున్నట్టు చెబుతున్నారు.

**సమావేశాల్లో తరచూ శ్రీగణేష్ సవాల్**

సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు పాలకమండలి సమావేశాల్లో ఆర్మీ నుంచి రావాల్సిన సర్వీసు చార్జీల బకాయిల విషయం తరచూ ప్రస్తావనకు వస్తోంది. ఈ విషయమై కేంద్ర రక్షణశాఖతో మాట్లాడతామని స్థానిక మల్కాజిగిరి లోక్‌సభ సభ్యుడు ఈటల రాజేందర్, సికింద్రాబాద్ కంటోన్మెంట్ నామినేటెడ్ మెంబర్ చెబుతున్నప్పటికీ బకాయిలు మాతం వసూలు కావడం లేదని, తక్షణమే బకాయిలు వసూలు చేసి, చిత్తశుద్ధి నిరూపించుకోవాలంటూ ప్రతి సమావేశంలో ఎమ్మెల్యే శ్రీగణేష్ సవాలు చేయడం పరిపాటిగా మారింది. తాము కంటోన్మెంట్ అభివృద్ధికి పాటు పడుతున్నామని, మోదీ సర్కారు అద్భుతంగా పని చేస్తున్నదని, రేవంత్‌రెడ్డి ప్రభుత్వం కూడా కంటోన్మెంట్‌కు నిధులు కేటాయించాలంటూ ఎంపీ ఈటల రాజేందర్, నామినేటెడ్ సభ్యురాలు బాణుక నర్మదలు ప్రస్తావిస్తుండగా, ముందు సర్వీసు చార్జీలు ఇప్పించండి అంటూ శ్రీగణేష్ కామెంట్ చేస్తుండడం గమనార్హం.

## 'హస్తం'ను బలోపేతం చేసే దిశగా కసరత్తు

సికింద్రాబాద్, జూన్ 19(ఆంధ్రజ్యోతి): జంటనగరాల్లో కాంగ్రెస్ పార్టీ శాసనసభ్యుడు ప్రాతినిధ్యం వహిస్తున్న ఏకైక అసెంబ్లీ నియోజకవర్గమైన సికింద్రాబాద్ కంటోన్మెంట్‌లో పార్టీని మరింత బలోపేతం చేసే దిశగా కసరత్తు ప్రారంభమైంది. దీనిలో భాగంగా గురువారం స్థానిక సికింద్రాబాద్ కంటోన్మెంట్ శాసనసభ్యుడు ఎన్.శ్రీగణేష్ అధ్యక్షతన బూత్ స్థాయి సమావేశం ఏర్పాటు చేసింది. రాజ్యసభ సభ్యుడు ఎం.అనిల్‌కుమార్ యాదవ్, పార్టీ పరిశీలకులు రాచమళ్ల సిద్ధేశ్వర్‌లను ముఖ్యఅతిథులుగా ఆహ్వానించి, కంటోన్మెంట్‌లోని 2, 3, 4, 5, జీహెచ్ఎంసీలోని మోండా మార్కెట్ డివిజన్లకు చెందిన పార్టీ శ్రేణులతో సమావేశమయ్యారు. నియోజకవర్గంలోని అన్ని బూత్‌లలో పార్టీని మరింత బలోపేతం చేయడం, ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి చేరేలా కృషి చేయడం, కష్టపడి పని చేసే పార్టీ నాయకులు, కార్యకర్తలకు తగిన గుర్తింపు కల్పించడం తదితర అంశాలపై కూలంకషంగా చర్చించారు. ఈ సందర్భంగా అనిల్‌కుమార్ యాదవ్ మాట్లాడుతూ కంటోన్మెంట్ నియోజకవర్గం యావత్ హైదరాబాద్‌లో కాంగ్రెస్ పార్టీకి వెలుగునిస్తుందని అన్నారు. శ్రీగణేష్ మాట్లాడుతూ పార్టీ పటిష్టతకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. కాగా ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్, ఎమ్మెల్యే శ్రీగణేష్, పార్టీ పరిశీలకులు సిద్దేశ్వర్‌లకు పీసీసీ కార్యదర్శి ఎస్.రాజేష్‌యాదవ్ ఘనంగా స్వాగతం పలికారు. వారిని దుశ్శాలువాలు, పూలమాలలతో సత్కరించారు.


ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్, ఎమ్మెల్యే శ్రీగణేష్‌లను సత్కరిస్తున్న పీసీసీ కార్యదర్శి ఎస్.రాజేష్‌యాదవ్


లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్

## సంక్షేమ పథకాలు సద్వినియోగం చేసుకోవాలి

- ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్

మారేడుపల్లి, జూన్ 19 ( ఆంధ్రజ్యోతి ) : సంక్షేమ పథకాలు సద్వినియోగం చేసుకొని లబ్ధి పొందాలని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ కోరారు. గురువారం మారేడుపల్లిలోని కార్యాలయంలో 41మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి 34, షాదీ ముబారక్ 7 ఆర్థిక సహాయం చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లబ్ధి పొందినవారు తమ పరిసరాలలోని అర్హులైన వారు సద్వినియోగం చేసుకునేలా అవగాహన కల్పించాలని కోరారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు టి.మహేశ్వరి, కుర్మ హేమలత, మాజీ కార్పొరేటర్లు శేషుకుమారి, మల్లిఖార్జున్ గౌడ్, నాయకులు అత్తిలి శ్రీనివాస్‌గౌడ్, హరికృష్ణ, వెంకటేషన్ రాజు, నాగులు తదితరులు పాల్గొన్నారు.


సీసీ రోడ్డు పనులను ప్రారంభించిన కార్పొరేటర్ కంది శైలజ తదితరులు

## అభివృద్ధి పనుల్లో వెనుకడుగు వేయం

బౌద్ధనగర్, జూన్ 19(ఆంధ్రజ్యోతి): బౌద్ధనగర్ డివిజన్‌లో అభివృద్ధి పనుల్లో వెనుకడుగు వేయమని కార్పొరేటర్ కందిశైలజ అన్నారు. గురువారం రామాలయం వద్ద నూతనంగా చేపడుతున్న సీసీ రోడ్డు పనులకు అధికారులతో కలిసి కార్పొరేటర్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బీఆర్ఎస్ హయాంలోనే డివిజన్‌లో అభివృద్ధి జరిగిందన్నారు. సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని తెలిపారు. అనంతరం స్థానికంగా ఉన్న రేషన్‌షాపులను తనిఖీ చేసి, సన్నబియ్యం సవ్యంగా సరఫరా చేస్తున్నారా లేదని లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఏఈ లావణ్య, నాయకులు శ్రీకాంత్, బెజ్జంకి రాజేష్, కుమార్, సచిన్ ఉండేటి, మల్లేష్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.


మల్లయ్యచారి మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న డీజీ నరసింహరావు, కామ్రేడ్లు

## సీపీఎం సీనియర్ నేత మల్లయ్యచారి మృతి

మల్కాజిగిరి, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): మల్కాజిగిరి సాయినగర్‌లో నివసించే సీపీఎం సీనియర్ రాష్ట్ర నాయకులు మల్లయ్యచారి (83) గురువారం మృతి చెందారు. సీపీఎం నేత డీజీ నరసింహరావు పలువురు పార్టీ నాయకులు మల్లయ్యచారి మృతదేహం వద్ద పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళులుఅర్పించారు. పార్టీ పతాకాన్ని కప్పి ఆయన మృతి పట్ల తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. మల్లయ్య చారి అతిపేద కుటుంబంలో జన్మించారని అన్నారు. కార్యక్రమంలో కామ్రేడ్ కృపాసాగర్, పాపిరెడ్డి, బాబు, విజయ్‌కుమార్, నారాయణరెడ్డి, సూర్యకుమార్, సత్యనారాయణ తదితరలు పాల్గొని సంతాపం వ్యక్తం చేశారు.


అంబేద్కర్‌నగర్‌లో యోగాసనాలు వేస్తున్న కాలనీ వాసులు

## యోగాతో మానసిక ప్రశాంతత

బిట్స్ పిలానీ, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): యోగాతోనే మానసిక ప్రశాంతతా సిద్ధిస్తుందని, దైనందిక జీవితంతో యోగాను భాగం చేసుకోవాలని యోగా గురువు శంకరాచారి అన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని జవహర్‌నగర్ కార్పొరేషన్ అంబేద్కర్ నగర్ శివాలయం సమీపంలో అనిల్ ఆధ్వర్యంలో గురువారం యోగా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శంకరాచారి మాట్లాడుతూ ఆసనాలు, ప్రాణాయంతోనే ఒత్తిడి దూరం అవుతుందని, యోగా మానవత విలువలకు అద్దంపట్టేలా శాంతి సామరస్యాలకు దోహదపడే శక్తినిస్తుందని అన్నారు. ప్రస్తుతమున్న మొబైల్ ప్రపంచంలో యోగాతోనే రోగాలు దరిచేరవని పేర్కొన్నారు. కార్యక్రమంలో జోగారావు, వెంకన్న, శ్రీధర్, రమేష్, ప్రసాద్, హరీశ్ రెడ్డి, పద్మారావు, సంతోష్, నర్సింహయాదవ్, శ్రీనివాస్, మహేందర్ పాల్గొన్నారు.

## రాహుల్‌గాంధీ జన్మదినం సందర్భంగా సేవా కార్యక్రమాలు

సికింద్రాబాద్, జూన్ 19(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ ఎంపీ రాహుల్ గాంధీ జన్మదినం సందర్భంగా బోయినపల్లిలో స్వచ్ఛంద, సేవా కార్యక్రమాలు నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ యువజన విభాగం కంటోన్మెంట్ ఉపాధ్యక్షుడు భాను ప్రకాష్ ఆధ్వర్యంలో గురువారం జరిగిన కార్యక్రమంలో సికింద్రాబాద్ కంటోన్మెంట్ పాలక మండలి మాజీ ఉపాధ్యక్షుడు జంపన ప్రతాప్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. పారిశుధ్య కార్మికులకు మిఠాయిలు, పండ్లు పంపిణీ చేశారు. స్థానికంగా మొక్కలు నాటారు. నాయకులు గోమతి, స్టీవెన్, ఆల్ఫ్రెడ్, అనీష్, ప్రేమ్, వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.


పారిశుధ్య కార్మికులకు మిఠాయిలు, పండ్లు పంపిణీ చేస్తున్న కాంగ్రెస్ నాయకుల

### జన్మదిన శుభాకాంక్షలు


కాంగ్రెస్ పార్టీ అగ్ర నాయకుడు రాహుల్‌గాంధీ సందర్భంగా టీటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు మోతే శోభన్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి గురువారం తార్నాకలోని తన నివాసంలో కేక్ కట్ చేసి ఘనంగా సంబురాలు జరుపుకున్నారు.

\- తార్నాక, ఆంధ్రజ్యోతి


బోయినపల్లి మార్కెట్ యార్డులో గురువారం కేక్ కట్ చేసి రాహుల్‌గాంధీ జన్మదిన వేడుకలు జరుపుకున్న మార్కెట్ ఛైర్మన్ రాగీరు ఆనంద్‌బాబు, వైస్ ఛైర్మన్ డి.బి.దేవేందర్ తదితర సభ్యులు.

\- సికింద్రాబాద్, ఆంధ్రజ్యోతి



## ఆర్‌సీసీ డ్రైన్ పనులకు మోక్షం

రెజిమెంటల్‌బజార్,జూన్ 19(ఆంధ్రజ్యోతి): 'ఆర్‌సీసీ డ్రైన్ పనుల్లో జాప్యం' శీర్షికతో ఆంధ్రజ్యోతి పత్రికలో 4న ప్రచురితమైన కథనంతో పనులు ప్రారంభమయ్యాయి. గురువారం కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్, కార్పొరేటర్ కొంతం దీపిక మోండా డివిజన్ రెజిమెంటల్‌బజార్‌లో ఆర్‌సీసీ డ్రైన్ పనులకు ఆటంకంగా ఉన్న అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పైపులైన్ పనుల ప్రారంభించారు. రూ.11 లక్షల వ్యయంతో చేపట్టనున్న నూతన పైపులైన్ నిర్మాణంతో పరిష్కారం లభించనుంది. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు చిర్రబోయిన సంతోష్ యాదవ్, అల్లాడి గౌరిశంకర్, బాబురావ్ ముదిరాజ్, నందికంటి రవి, కేక్ శ్రీను, వైష్ణవి యాదవ్, బద్రినాథ్ యాదవ్, అరవింద్ యాదవ్, కొంతం నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## పేదల వైద్య సేవలకు సహకారం


లబ్ధిదారుడి కుటుంబ సభ్యులకు ఎల్‌ఓసీ పత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే పద్మారావుగౌడ్

బౌద్ధనగర్, జూన్ 19(ఆంధ్రజ్యోతి): పేదల వైద్య సేవలకు తమవంతు సహకారమందిస్తామని సికింద్రాబాద్ నియోజకవర్గ శాసనసభ్యులు తీగుళ్ల పద్మారావుగౌడ్ అన్నారు. సీతాఫల్‌మండి శ్రీనివాసనగర్‌కు చెందిన మైత్రి చేతన్ కార్తీక్ అనారోగ్యంతో బాధపడుతున్న దశలో స్థానికుల ద్వారా సమాచారమందుకున్న ఎమ్మెల్యే పద్మారావుగౌడ్ అతడికి వైద్యం నిమిత్తం సీఎం సహాయనిధి నుంచి ఎల్ఓసీ(లెటర్ ఆఫ్ క్రెడిట్) ద్వారా రెండు లక్షల యాభైవేల రూపాయలను మంజూరు చేయించారు. గురువారం సీతాఫల్‌మండి కార్యాలయంలో కార్తీక్ కుటుంబసభ్యులకు ఎల్ఓసీ పత్రాన్ని ఎమ్మెల్యే అందజేశారు. నాయకులు టీఆర్‌టీ శేఖర్, బెజ్జంకి రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

## ద.మ.రైల్వే ఎంప్లాయీస్ సంఘ్ డిప్యూటీ డిజిటల్ కార్యదర్శి నియామకం


వేగి మురళీకృష్ణ

చిలకలగూడ, జూన్ 19(ఆంధ్రజ్యోతి): ద.మ.రైల్వే ఎంప్లాయిస్ సంఘ్ డిప్యూటీ డిజిటల్ కార్యదర్శిగా వేగి మురళీకృష్ణను నియమిస్తూ నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ రైల్వేమెన్, ద.మ.రైల్వే ఎంప్లాయిస్ సంఘ్ ప్రధాన కార్యదర్శి మర్రి రాఘవయ్య ఉత్తర్వులు జారీ చేశారు. మురళీకృష్ణ మాట్లాడుతూ రైల్వే కార్మికులు, ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని, 8వ వేతన సంఘం అమలులో మెరుగైన జీతభత్యాలు. పాత పెన్షన్ అమలుకు కృషి చేస్తానని, పదవీ లభించినందుకు జాయింట్ జనరల్ సెక్రటరీ భరణీ భానుప్రసాద్, మీడియా ప్రతినిధి షేక్ రవూఫ్‌లకు ధన్యవాదాలు తెలిపారు.


సీతాఫల్‌మండిలో శానిటేషన్ డ్రైవ్ కార్యక్రమంలో పాల్గొన్న ఉప కమిషనర్ సుభాష్‌రావు, కార్పొరేటర్ సామల హేమ తదితరులు

## సీతాఫల్‌మండిలో శానిటేషన్ డ్రైవ్

బౌద్ధనగర్, జూన్ 19(ఆంధ్రజ్యోతి): సీతాఫల్‌మండిలో శానిటేషన్ డ్రైవ్‌ను గురువారం స్థానిక కార్పొరేటర్ సామల హేమ, జీహెచ్ఎంసీ సికింద్రాబాద్ సర్కిల్ ఉప కమిషనర్ సుభాషరావుతో కలిసి ప్రారంభించారు. సురేష్ థియేటర్, బీదలబస్తీ పరిసర ప్రాంతాల్లో రోడ్లపై పేరుకుపోయిన చెత్తను తొలగించి, డ్రైనేజీ పైపులైన్లు శుభ్రపరిచి, చెట్లకొమ్మలను తొలగించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ పరిశుభ్రత సామూహిక బాధ్యతని, ప్రతి ఒక్కరూ స్వచ్ఛతపై చొరవ చూపాలన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు వెంకటేశ్వర్లు, కౌశిక్, నాయకులు కరాటే రాజు, శైలేందర్, కృష్ణ, అజీజ్, మహేష్, లక్ష్మీ, సుజాత, లలిత, పద్మ, మౌనిక తదితరులు పాల్గొన్నారు.